


నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | VIKARABAD


## కుళ్లిన పండ్లు.. పాడైన సలాడ్



- అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన వాటితో ఫ్రూట్ జ్యూస్
- ఈగల మోత, బొద్దింక దాడి
- లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారం
- అమీర్‌పేటలో పలు జ్యూస్ సెంటర్లలో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు
- నిర్వాహకులకు నోటీసులు జారీ

IVలో

# మాకెప్పుడు ఇస్తారు..

- రంగారెడ్డి జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 1,22,084 మంది దరఖాస్తు
- 23,000 కార్డులిచ్చి మమ అనిపించిన అధికారులు
- మిగిలిన దాదాపుగా 1,00,000 మందికి పెండింగ్‌లో..
- అన్ని పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా నిర్ణయించడంతో తమకు పథకాలు, సన్నబియ్యం అందడంలేదని లబ్ధిదారుల ఆవేదన
- కొత్త కార్డులను పంపిణీ చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

**పైలెట్ గ్రామాల్లోనూ అరకొరగానే పంపిణీ**

రంగారెడ్డి, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తించాలంటే రేషన్ కార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. మీ సేవతోపాటు ప్రజాపాలనలో 1,22,084 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటిపై పరిశీలన జరిపిన అధికారులు గత మార్చి నెలలో సుమారు 23,000 మందికి మాత్రమే కొత్తగా రేషన్‌కార్డులు అందజేశారు. మిగిలిన దాదాపు 1,00,000 మంది పరిస్థితి అయోమయంగా మారింది. వారికి ఎప్పుడు పంపిణీ చేస్తారో అధికారులు స్పష్టం చేయడం లేదు. సబ్సిడీ గ్యాస్, సబ్సిడీపై విద్యుత్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాలు తెల్ల రేషన్‌కార్డులు కలిగిన వారికే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

### పరిశీలన పేరుతో కాలయాపన..

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పరిశీలన పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాకు చెందిన 21 మండలాలు, 16 మున్సిపాలిటీలు, 2 నగరపాలక సంస్థల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయి. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అనధికారిక లెక్కల ప్రకారం రేషన్‌కార్డులు కలిగి ఉన్నా కుటుంబసభ్యులను అందులో చేర్పించాలని సుమారు 1,30,000 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. అలాగే, మీ సేవతోపాటు ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా సుమారు 5,00,000 వరకు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా..అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దరఖాస్తుల వాస్తవిక పరిశీలనకు.. అధికారులు చెబుతున్న లెక్కలకు ఏ మాత్రం పొంతన లేదు. దీంతో కొత్త రేషన్‌కార్డులు ఎవరికి వస్తాయో ...ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది.

### పైలెట్ గ్రామాల్లోనూ అరకొరే..

ప్రజా పాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుకోసం ప్రభుత్వం జిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలను ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో ఆరు గ్యారెంటీలను వందశాతం అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, పైలెట్ గ్రామాల్లోనూ దరఖాస్తు చేసుకున్న వారికి అరకొరగానే రేషన్ కార్డులను అందించారనే ఆరోపణలున్నా యి. మిగిలిన అర్హులు తమకు ఎప్పుడు ఇస్తారని .. అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

### సన్నబియ్యానికి నోచుకోని పేదలు..

జిల్లాలో ఎంతోమంది పేదలున్నా వారికి రేషన్‌కార్డులు లేకపోవడంతో సన్నబియ్యానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం అర్హులందరికీ సన్నబియ్యం ఇస్తామని ప్రకటించినా ఎంతోమంది పేదలకు ఇంకా రేషన్ కార్డులే అందలేదు. దాంతో సన్నబియ్యం వారికి అందడంలేదు. ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

### సంక్షేమ పథకాలు అందడం లేదు..



సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డు కలిగి ఉండాలని ప్రభుత్వం లింక్ పెట్టడంతో ఇప్పటివరకు రెండుసార్లు దరఖాస్తు చేశా. అయినా, ఇప్పటికీ కొత్త కార్డు రాలేదు. అధికారులు జిల్లాలో 23,000 మందికి అందించి చేతులు దులుపుకొన్నారు. మిగిలిన దాదాపు 1,00,000 మందికి ఎప్పుడిస్తారో.. చెప్పడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదు. ప్రభుత్వం స్పందించి త్వరగా కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

**-సిద్ధిగారి సురేశ్, కడ్తాల్ మండలం**

### సన్నబియ్యం రావడం లేదు..



కాంగ్రెస్ సర్కార్ ప్రతి పథకాన్నీ రేషన్ కార్డుతో ముడిపెట్టడంతో కొత్త కార్డుకోసం దరఖాస్తు చేశా. అయినా ఇప్పటికీ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నా. కార్పొరేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డును అడుగుతున్నారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కూడా రావడం లేదు.

**- పాలకుర్ల రాజు గౌడ్, నాగిళ్ల గ్రామం, మాడ్గుల మండలం**

### కొత్త కార్డులివ్వాలి



కాంగ్రెస్ పార్టీ అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయాలి. ప్రతి పథకానికీ రేషన్ కార్డును లింక్ పెట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా. అధికారులు కొంతమందికి కొత్త కార్డులను పంపిణీ చేసి మిగిలిన వారికి ఇవ్వకపోవడం దారుణం. **-కడారి అల్లాజీ యాదవ్, ఇర్విన్ గ్రామం, మాడ్గుల మండలం**

# కడుపుకోతలు

- ధనార్జనే ధ్యేయంగా కాన్పులు చేస్తున్న పలు ప్రైవేట్ దవాఖానలు
- సాధారణ డెలివరీలకు అవకాశమున్నా.. సీ-సెక్షన్‌కే ప్రాధాన్యం
- వికారాబాద్ జిల్లాలో గతేడాదిలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో 3828 ప్రసవాలు జరిగితే.. అందులో 3,193 సిజేరియనే..
- సిజేరియన్లు చేస్తూ రూ.60,000 నుంచి రూ.80,000 వరకు వసూలు

వికారాబాద్ జిల్లాలో 'కడుపుకోత'లు జోరు గా సాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తిపడి సిజేరియన్లకు తెగబడుతున్నా యి. సాధారణ కాన్పులకు అవకాశమున్నా.. ఏదో ఒక సాకు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని.. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని, లేదంటే తల్లీబిడ్డకు ప్రమాదమని చెప్పి గర్భిణుల బంధువులను భయపెట్టేస్తున్నాయి.

**-వికారాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ)**

దవాఖానలకు వచ్చే గర్భిణులకు వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. అయితే అవి ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితమవుతున్నాయి. ప్రైవేట్ దవాఖానలు పట్టించుకోవడం లేదు. డెలివరీ కోసం ప్రైవేట్ దవాఖాన తలుపు తడితే చాలు.. సిజేరియన్లు చేసేస్తున్నారు. అవసరం లేకపోయినా కాసుల కోసం ఆపరేషన్లు చేస్తున్నారు. జిల్లాలో 50 వరకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లున్నాయి. వాటిలో మెడికల్ షాపులను అనుబంధంగా నడుపుతూ ప్రజల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారు. అత్యాధునిక వైద్య సేవలంటూ రోగులను ఆకర్షిస్తూ ఒక్కో సిజేరియన్‌కు రూ.80,000 నుంచి రూ.లక్ష వరకు లాగుతున్నారు. జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో జరిగే ప్రసవాల్లో దాదాపు 90 శాతం మేర 'కడుపు కోత'లేనని వైద్యారోగ్యశాఖ అధికారులు రూపొందించిన నివేదిక ద్వారా తెలుస్తున్నది. అదే సమయంలో ప్రభుత్వ దవాఖానల్లో జరిగే డెలివరీల్లో 20-30 శాతం ప్రసవాలు సిజేరియన్లు ఉంటున్నాయి. జిల్లా పరిధిలో 50 వరకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లుండగా.. సీటీస్కాన్, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్లు, ల్యాబ్‌లు కలిపి 20 వరకు డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ప్రతి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో మెడికల్ స్టోర్ ఉండగా.. వాటిని ఆయా దవాఖానల యాజమాన్యాలే నడిపిస్తున్నాయి. ఈ దవాఖానలకు ఆర్ఎంపీ, పీఎంపీలు మధ్యవర్తులుగా పని చేస్తున్నారు. వారితోపాటు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, పత్రికలు, టీవీలు, సినిమా థియేటర్లలో ప్రకటనలు ఇవ్వడం, గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించడం ద్వారా ప్రజలకు చేరువవుతూ వారికి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. తమ దవాఖానకు వస్తే అత్యాధునిక సేవలు అందిస్తామని నమ్మబలుకుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు ఒకటో నెల నుంచి మొదలుకొని తొమ్మిదో నెల వచ్చే వరకు ప్రతి నెలా స్కానింగ్‌లు, పరీక్షలు చేస్తున్నారు. తల్లి గర్భంలో పిండం కాస్త కదిలితే చాలు స్కానింగ్ తీస్తున్నారనే ఆరోపణలు ఉన్నారు. తక్కువలో తక్కు వ ప్రతినెలా రూ. 3,000 నుంచి రూ. 5,000 ఖర్చు చేయాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. డెలివరీ కోసం నిండు గర్భిణి హాస్పిటల్‌లో అడుగు పెడితే కోతలేనిదే బయటికి పంపించడం లేదు.



### విచ్చలవిడిగా ఆపరేషన్లు..

ప్రైవేట్ దవాఖానలకు వెళ్లిన గర్భిణులకు విచ్చలవిడిగా ఆపరేషన్లు చేస్తున్నారు. స్కానింగ్ తీయడం, బిడ్డ అడ్డం తిరిగిందని, రక్తం తక్కువగా ఉందని, పేగులు మెడకు చుట్టుకున్నాయని, ఆపరేషన్ చేయకుంటే తల్లికి బిడ్డకు ప్రమాదం అని రకరకాల కారణాలు చెప్పి గర్భిణులు, వారి బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తూ డాక్టర్లు తమకు తాముగా డిమాండ్ పెంచుకుంటున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌ల్లో గడిచిన ఏడాదిలో 3,828 ప్రసవాలు జరుగగా వాటిలో 3,193 డెలివరీలు సిజేరియన్లే. సాధారణ ప్రసవాలు కేవలం 635 మాత్రమే. ఇదే క్రమంలో ప్రభుత్వ దవాఖానల్లో గతేడాదిలో 9,361 ప్రసవాలు జరుగగా ..వాటిలో 3,348 ప్రసవాలు కడుపుకోత ఆపరేషన్లు కాగా.. 6,003 సాధారణ ప్రసవాలు నమోదయ్యాయి. ప్రైవేట్ దవాఖానలకు డెలివరీ కోసం వెళ్తే బిల్లుల మోత మోగుతున్నది. గర్భిణులు ఆస్పత్రిలో అడుగు పెట్టగానే ఇన్వెస్టిగేషన్ పేరుతో రూ. 4,000, మత్తు మందు వైద్యుడి పేరుతో రూ.2,000 నుంచి రూ.3,000 వరకు, ఆపరేషన్ మెడిసిన్ కిట్‌కు రూ.6,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారు. ఇక డిశ్చార్జ్ రోజు వరకు బెడ్ చార్జి, రూమ్ సర్వీస్, సర్వీస్ చార్జీలు, ఆస్పత్రి మెయింటెనెన్స్, పవర్ బిల్లు ఇలా అన్ని కలిపి రూ. 60,000 నుంచి రూ.80,000 సమర్పించుకోనిదే తల్లీ బిడ్డ ప్రైవేట్ దవాఖానల నుంచి ఇంటికి చేరే పరిస్థితి లేదు. అదేవిధంగా ప్రైవేట్ దవాఖానల్లో సాధారణ ప్రసవాల శాతం చాలా తక్కువ అయినా బిల్లుల వసూలు మాత్రం తగ్గడం లేదు. నార్మల్ డెలివరీ అయ్యే గర్భిణులకూ ఇన్వెస్టిగేషన్ పేరుతో రూ. 5,000, మెడిసిన్ చార్జీలు రూ.3,000, రూ. 5,000 ఇతరత్రా ఖర్చులు అవుతున్నాయి. మెయింటెనెన్స్, రూమ్ సర్వీస్, బెడ్ చార్జి, ఇతరత్రా అన్ని చార్జీలు కలిపి రూ.50,000 బిల్లు చేస్తున్నారు. దీనిని బట్టి ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్‌లో జరుగుతున్న సిజేరియన్ల దందాపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుని.. సామాన్యుడికి వైద్యం చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

## జీహెచ్ఎంసీలో నలుగురు మెడికల్ ఆఫీసర్లపై చర్యలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన నలుగురు మెడికల్ ఆఫీసర్లకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మెమోలు జారీ చేశారు. ఈ-చలాన్ల జారీలో పనితీరు మెరుగ్గా లేని చార్మినార్, మలక్‌పేట, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం సర్కిళ్లకు చెందిన మెడికల్ ఆఫీసర్లకు మెమోలు జారీ చేశారు.

### నేడు గ్రూప్- 1 అభ్యర్థుల ధర్నా

ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో శుక్రవారం గ్రూప్-1 అభ్యర్థుల ధర్నా జరగనున్నది. అభ్యర్థులు తమకు జరిగిన అన్యాయంపై గళం ఎత్తనున్నారు. పరీక్ష రాసిన వారందరూ తరలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గ్రూప్-1 తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందంటూ..పేపర్ వాల్యూయేషన్ సరిగ్గా చేయలేదని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని ఇప్పటికే అభ్యర్థులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే.

## రజతోత్సవ మహాసభను సక్సెస్ చేద్దాం

### డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 17 : వరంగల్‌లో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా తరలిరావాలని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల, శంకర్‌పల్లిలలో ఆయన రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ రెండు మండలాలకు చెందిన అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధే తప్పా ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదని విమర్శించారు. రజతోత్సవ సభకు ప్రజలు గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి జాతరలా తరలివెళ్లి సక్సెస్ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల అధ్యక్షులు పెద్దొళ్ల ప్రభాకర్, గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమల్ల ఆంజనేయులు, పార్టీ చేవెళ్ల మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు శేఖర్‌రెడ్డి, కొల్లగల్ల భాస్కర్, శేరి రాజు, మాజీ సర్పంచ్‌లు నరహరి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ ఘని, ఎల్లన్న, వెంకటేశ్, నర్సింహులు, పాండు, రెండు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతరలా తరలివెళ్లాలి



చేవెళ్లలో రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి

# గాలివాన బీభత్సం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

- చేవెళ్లలోని బీజాపూర్ హైవేపై విరిగి పడ్డ భారీ మర్రి వృక్షం
- భారీగా నిలిచిన ట్రాఫిక్
- పెద్దేముల్ మండలంలో కూలిన ఇంటి పై కప్పులు
- బొంరాస్‌పేటలో పిడుగు పడి 20 గొర్రెలు మృతి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. చేవెళ్లలోని బీజాపూర్ హైవేపై మిర్జాగూడ-ఖానాపూర్ గ్రామాల మధ్యలో భారీ మర్రి వృక్షం నేలపై పడడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. అదే విధంగా వికారాబాద్ జిల్లాలోని తాండూరులో సాయిపూర్ రోడ్డు మార్గంలో వర్షం నీటిలో ఆటో ఇరుక్కుపోయింది. మామిడి కాయలు రాలడంతోపాటు అరటి తోట నేలకు వంగింది. మైసమ్మగడ్డతండాకు చెందిన పిక్లానాయక్ అనే రైతు గొర్రెలపై పిడుగు పడడంతో 20 గొర్రెలు మృతి చెందాయి.



తాండూరు : సాయిపూర్ రోడ్డులో వర్షం నీటిలో ఇరుక్కుపోయిన ఆటో







చేవెళ్ల : బీజాపూర్ హైవేపై మర్రి చెట్టు విరిగి పడడంతో నిలిచిన వాహనాలు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 17 : చేవెళ్ల మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి చేవెళ్ల మున్సిపాలిటీలోని ఓ ఫ్లెక్సీ విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో నాలుగైదు గంటలపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బీజాపూర్ హైవేపై మిర్జాగూడ-ఖానాపూర్ గ్రామాల మధ్యలో భారీ మర్రి వృక్షం నేలపై పడడంతో ఆ దారిలో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెట్టును రోడ్డుపై నుంచి తొలగించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్లు విద్యుత్ వైర్లు తెగడంతోపాటు స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అదేవిధంగా పలు గ్రామాల్లో వరి, మామిడి తోటలతోపాటు ఆరు తడి పంటలకూ నష్టం వాటిల్లింది.

### రోడ్లన్నీ జలమయం

వికారాబాద్ : వికారాబాద్‌లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

### బంట్వారం..

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో గాలివా న బీభత్సం సృష్టించింది. సల్బత్తాపూర్ సమీపంలో గేటుకు వెళ్లే దారిలో రెండు చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. వాటిని అటుగా వెళ్తున్న జేసీబీ తొలగించింది. అలాగే, ఒగ్లాపూర్ గేటు దగ్గర భారీ తుమ్మ చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిం ది. కోట్‌పల్లి మండలంలోని ఎన్నారంలోనూ వడగండ్ల వాన కురిసింది.



బంట్వారం : ఈదురు గాలులకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

### పిడుగు పడి 20 గొర్రెలు మృతి

బొంరాస్‌పేట : మండలంలోని బుర్రితండాకు అనుబంధంగా ఉన్న మైసమ్మగడ్డతండాకు చెందిన పిక్లానాయక్ అనే రైతు గొర్రెలపై పిడుగు పడడంతో 20 గొర్రెలు మృతి చెందాయి. గురువారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వాన రావడంతో పిక్లానాయక్ తన గొర్రెలను ఇంటికి దగ్గరలో ఉన్న చెట్టు కిందికి తీసుకెళ్లి.. తాను ఇంట్లోకెళ్లాడు. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో దాని కింద ఉన్న 20 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ. 2,50,000 వరకు ఉంటుందని.. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



### నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ధారూరు : మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. నాగసముందర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో స్తంభాలు నేలపై పడిపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా పలు చెట్లూ భూమిపై విరిగి పడిపోయాయి.



## తాండూరులో భారీ వర్షం

తాండూరు : తాండూరు నియోజకవర్గంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వడగళ్ల వాన కురువడంతో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. మామిడి కాయలు రాలడంతోపాటు అరటి తోట నేలపై పడింది. తాండూరు మున్సిపల్ పరిధిలో భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. భారీ కటౌట్లు, బ్యానర్లు చిరిగి రోడ్లపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీ భావిగి భద్రేశ్వర జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు ధ్వంసమయ్యాయి. సాయిపూర్ మార్గంలోని మురుగు కాల్వలు మూసుకుపోవడంతో వర్షం నీరుతోపాటు మురుగు రోడ్లపై ఏరులై పారింది. అదేవిధంగా వర్షం నీటిలో ఆటో ఇరుక్కుపోయింది. పెద్దేముల్ మండలంలోని కొండాపూర్‌లో గొట్లపల్లి శ్రీను, పట్నం శ్రీనివాస్, నెల్లిగడ్డ తండాలో మూడావత్ బుజ్జి భాయ్ ఇండ్ల పై కప్పులు భారీ ఈదురు గాలికి ఎగిరిపడ్డాయి. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. పగలు నెత్తి పగిలేలా ఎండ... సాయం త్రం ప్రమాదకరంగా గాలివాన బీభత్సంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తాండూరు: పెద్దేముల్ మండలం కొండాపూర్‌లో ఈదురు గాలి వానకు కూలిన ఇంటి పైకప్పు